క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిని అదుపులోకి తీసుకొని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చారు. దీంతో జడ్జి ఇద్దరికి రూ.2వేల చొప్పున, మరో వ్యక్తికి రూ.2 వేల జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పుల్‌కల్(అందోల్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోతో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్‌కల్ మండల కేంద్రం నుంచి గుట్టుచప్పుడు కాకుండా మద్యం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఘటనాస్థలానికి చేరుకొని ఆటోలో తరలిస్తున్న 480 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. విచారణ నిమిత్తం నిందితుడిని పుల్‌కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రలోభాలకు గురికావొద్దు



వట్‌పల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వట్‌పల్లి(అందోల్): ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మర్వెల్లి, పోతులబోగుడా, వట్‌పల్లి గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ సహాయంతో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలను ప్రశాతంగా నిర్వహించేందుకు రాజకీయ నేతలు, ఓటర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

నారాయణఖేడ్: నిజాంపేట మండలం మెఘ్యానాయక్ తండా, రామదస్‌ండాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు రెండు రోజుల కిందట బీజేపీలో, దామర్‌చెరువు, ఖేడ్ మండలం గుర్గమ్మతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ లో చేరగా గురువారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో వారు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. భూపాల్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కంగ్టి మండలం నాగూరు(బి), బీంరా, సిద్దంగిర్గా, సుక్కల్‌తీర్థ్, ఎన్కెమురి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు మద్దతుగా భూపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని పలువార్డుల్లో పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

'ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం'

జోగిపేట(అందోల్): ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జోగిపేటలో గురువారం భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ మూడోసారి ప్రధానిగా గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీగా బీబీ పాటిల్ మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్లు ధనుంజయ పాటిల్, మఠం చంద్రశేఖర్, బీజేపీ నాయకులు సుమన్, పట్టణ అధ్యక్షుడు శివశంకర్, మండల అధ్యక్షుడు శివచందర్, గోపాల్‌రావు, అనిల్, నవీన్, వెంకటేశం, రవీందర్‌గౌడ్, శ్యామాగౌడ్ పాల్గొన్నారు.

కూలీలకు తాగునీటి సౌకర్యం

మునిపల్లి(అందోల్): ఎండలు తీవ్రంగా ఉండడంతో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు తాగునీటి సౌకర్యంతో పాటు టర్పాలిన్ కవర్‌తో నీడను ఏర్పాటు చేసినట్లు ఏపీఓ యాదగిరి తెలిపారు. కూలీలకు కూలిరేట్లు పెంచడంతో రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతోందన్నారు. కూలికి వచ్చిన వారందరికీ పని కల్పిస్తున్నామన్నారు. జాబ్ కార్డుల్లో పేర్లున్న కూలీలు ఎంతమంది పనులకు వచ్చినా పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటుపై నిర్లక్ష్యపు నీడలు

- విద్యుత్ వినియోగదారులకు శాపంగా అధికారుల తీరు
- నాలుగేళ్ల క్రితమే సబ్‌స్టేషన్ మంజూరు
- స్థలం కేటాయించినా నిర్మాణానికి నోచుకోని వైనం
- చోద్యం చూస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు
- ఇబ్బందుల్లో తెల్లాపూర్ ప్రాంత ప్రజలు

అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది విద్యుత్ అధికారుల తీరు.. తెల్లాపూర్ పరిధిలో అనేక బహుళ అంతస్తుల భవనాలు, కాలనీలు వెలుస్తుండటంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగింది. ప్రస్తుతం తెల్లాపూర్ పరిధిలోని విద్యుత్‌నగర్ సబ్‌స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో ఈ సబ్‌స్టేషన్‌పై మరింత భారం పడుతుండటంతో గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం తెల్లాపూర్‌కు నూతన సబ్‌స్టేషన్ మంజూరు కాగా రెండేళ్ల క్రితం స్థలాన్ని కూడా కేటాయించారు. అయినా నేటికీ అదనపు సబ్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోవడం లేదు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



తెల్లాపూర్‌లో సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

రామచంద్రాపురం పట్టణ పరిధిలోని తెల్లాపూర్‌కు 4ఏళ్ల క్రితం నూతనంగా 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరైంది. అందుకు నిధులను సైతం మంజూరు చేశారు. కానీ.. అదే సమయంలో స్థలం కేటాయించకపోవడంతో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయలేకపోయారు. ఈ క్రమంలో విద్యుత్ సమస్యలు తీవ్రం కావడంతో రెండేళ్ల కిత్రం రేడియల్ రోడ్డు నెంబర్–7 ఆనుకొని ప్రభుత్వం 30 గుంటల భూమిని కేటాయించగా సంబంధించిన ప్రతాలను మున్సిపల్ అధికారులు విద్యుత్‌శాఖ అధికారులకు అందజేశారు. అయినా నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటితో ప్రహరీ నిర్మాణం

విద్యుత్‌శాఖ అధికారుల సూచనల మేరకు ప్రజాప్రతినిధులు మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. కాగా ప్రస్తుతం కేటాయించిన స్థలంలో చుట్టూ రూ.కోటి నిధులతో ప్రహరీ నిర్మించారు. స్థలంలో గుంతలు ఉండటంతో అందులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొంతమేరకు మట్టిని నింపారు. మిగతా మట్టిని కూడా పూర్తిస్థాయిలో నింపాలని విద్యుత్‌శాఖ అధికారులు మున్సిపల్ అధికారులకు సూచించగా మున్సిపల్ అధికారులు స్పందిస్తూ మీ నిధులు మీకు ఉండగా మేం జోక్యం చేసుకోవడం సబబు కాదని విద్యుత్ అధికారులకు సమాధానం చెబుతున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం

విద్యుత్ బిల్లులను ముక్కు పిండి వసూలు చేసే విద్యుత్‌శాఖ అధికారులు మరి సబ్‌స్టేషన్ ఎందుకు నిర్మించడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సబ్‌స్టేషన్ మంజూరయ్యాక స్థలం లేదన్నారు.. స్థలం మంజూరయ్యాక ప్రహరీ అన్నారు.. ప్రహరీ పూర్తయ్యాక మట్టిని నింపాలంటున్నారు. అసలు సబ్‌స్టేషన్ నిర్మించే ఆలోచన అధికారులకు ఉందా లేదా అని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి నింపితేనే పనులు ప్రారంభం

సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం రోడ్డు కన్నా ఎక్కువ లోతులో ఉండటంతో మట్టిని నింపితేనే పనులు ప్రారంభించే అవకాశం ఉంది. 200 టిప్పర్లకు పైగా మట్టిని నింపే అవకాశం ఉంటుంది. అందుకు రూ.లక్షల నిధులు అవసరం. కాగా గతంలో ప్రజాప్రతినిధులు మట్టిని నింపిస్తామని హామీ ఇవ్వడంతో మట్టికి నిధుల కోసం ప్రణాళికను రూపొందించలేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు.

దాతలు ముందుకు రావాలి

అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించారు. కానీ.. నేటికీ పనులను ప్రారంభించడంలేదు. సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలంలో మట్టిని నింపితేనే పనులను ప్రారంభిస్తామని అధికారులు తెగేసి చెబుతున్నారు. దీంతో ఈ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్న యజమానులతో పాటు దాతలను కూడా ప్రాధేయపడుతున్నాం. ఈ స్థలంలో మొరం నింపితే అందరికీ మేలు చేసిన వారమవుతాం. ఈ విషయంపై అధికారులు ఒప్పుకుంటే మా ప్రయత్నం చేస్తాం.



– ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రహరీ నిర్మించాం

విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాం. తమ వంతు బాధ్యతగా ఆ స్థలంలో మట్టిని కూడా పోయించాం. అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటు స్థలానికి సంబంధించిన పత్రాలను ఇప్పటికే విద్యుత్ అధికారులకు అందించాం.



– సంగారెడ్డి, కమిషనర్, తెల్లాపూర్ మున్సిపల్

బసవేశ్వరుడి మార్గంలో నడవండి

- రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్ పాటిల్
- ఘనంగా బసవేశ్వరుడి జయంతి



జహీరాబాద్ పట్టణంలో బసవేశ్వరుడి విగ్రహం

జహీరాబాద్ టౌన్: ప్రతిఒక్కరూ బసవేశ్వరుడి మార్గంలో నడవాలని రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే మహాత్మ బసవేశ్వరుడి 891వ జయంతి ఉత్సవాలు పట్టణంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జహీరాబాద్ ప్రాంతంలో అధికసంఖ్యలో ఉన్న వీరశైవ లింగాయత్ ప్రజలు తమ గురువైన బసవ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. వీరశైవ లింగాయత్ సమాజ్, రాష్ట్రీయ బసవదళ్ సంఘాల ఆధ్వర్యంలో ఏటా వేరువేరుగా ఉత్సవాలు జరుపుకుంటున్నారు. శుక్రవారం బసవన్నకు పూజ, ధ్వజారోహణం, ప్రార్థనలు, దోలారోహణం, సాయంత్రం శోభాయాత్ర ఊరేగింపు నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ తెలిపారు. అదేవిధంగా లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర, బైక్ ర్యాలీ ఉంటుందని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్ తెలిపారు. బసవ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని దత్తగిరి కాలనీ బసవ మండపంలోని గురువు బసవన్నకు పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ శివకుమార్ పూజలు నిర్వహించి ప్రార్థనలో పాల్గొన్నారు.



బసవేశ్వరుడికి పూజలు చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నాటుకుపోయిన జాతి, వర్ణ, వర్గ వివక్షతను రూపుమాపి సమసమాజ నిర్మాణం కోసం తన జీవితాన్ని తాగ్యం చేసిన విశ్వగురువు బసవేశ్వరుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

- ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఊట్ల మాజీ సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, గడ్డపోతారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ ప్రాధాన్యత ఇస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జోగిపేటలో...

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15, 17 వార్డుల్లో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌కు మద్దతుగా 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు సురేష్, సురేందర్‌గౌడ్, దుర్గేష్, చందర్, కోఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ పిట్ల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ డీజీ వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెండ్యాల రాములు, కోఆప్షన్ సభ్యుడు గోహెర్‌అలీ, నాయకులు చిట్యాల మధు పాల్గొన్నారు.

విద్యుత్‌నగర్‌లో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో మాజీ ఎంపీటీసీ తూర్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ పావని, సీనియర్ నాయకులు పర్సా శ్యాంరావు, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, వాజీద్ పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో..

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా జంగంపేట గ్రామంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.



జోగిపేట: ప్రచారంలో పాల్గొన్న కౌన్సిలర్లు



ఝరాసంగంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



విద్యుత్‌నగర్ ప్రచారం చేస్తున్న నాయకులు

ఇంటింటికి ప్రచారం ముమ్మరం

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని ఝరాసంగంతో పాటు ప్యారవరం, కొల్లూరులో ఆ పార్టీ నాయకులు గురువారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుద్రప్ప పాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు సంగన్న, రోహిత్, అశ్రఫ్ అలీ, పెంటయ్య, లియాకత్ అలీ, మున్నా, రుద్రయ్య స్వామి, రాజేందర్‌సింగ్, సంగమేశ్వర్, రవి, తుకారం, వహీద్‌అలీ, జైపాల్, ఫక్రుద్దీన్, ఇస్మాయిల్, మోహన్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం'



నారాయణఖేడ్: పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సంగారెడ్డిలో ప్రచారం చేస్తున్న నాయకులు



వెల్టూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: బీజేపీతోనే దేశ అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్ అన్నారు. జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ ఖేడ్ పట్టణంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనతో దేశం ప్రశాంతంగా, సుభిక్షంగా ఉందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి బీబీ పాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో బీజేపీ నాయకులు రాజుగౌడ్, విజయ్ షెట్కార్, సుగుణాకర్, రాథోడ్ సంతోష్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించండి

సంగారెడ్డి టౌన్: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దేశ్‌పాండే అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉపాధికూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. రఘునందన్‌రావుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాపయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్టూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలంపువ్వు గుర్తుకు ఓటేసి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మోహన్‌రెడ్డి, ఆదిత్య, అంబదాస్, భరత్, శ్రీకాంత్, వెంకటేశం, మహేందర్, శేఖర్, వీరేశం, సంగమేశ్వర్, అనిల్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండలంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రంలో బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరపున ఆయన కుమారుడు అభిషేక్ పాటిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది

మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు వచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నీటి కరువు, విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గత ప్రభుత్వంపై బురదజల్లే పని పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. బీజేపీ దేశానికి చేసిందేమీలేదన్నారు. తెల్లాపూర్ ప్రజల అవసరాల కోసం గత ప్రభుత్వం రూ.500కోట్ల విలువైన భూములను కేటాయించిందని గుర్తు చేశారు. మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యానారాయణ, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిక

రాయికోడ్(అందోల్): మండలంలోని నాగ్వార్, మాటూర్ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి దామోదర రాజనర్సింహా సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అంజయ్య, నాయకులు జ్ఞానేశ్వర్, పండరి పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో ఆయా గ్రామాలకు చెందిన బిచ్చయ్య, జ్ఞానరత్నం, చంద్రయ్య, వీరయ్య, ఖాజామియా, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి...

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు యువ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో కేఎంఆర్ యువసేన అధ్యక్షుడు చింతల్‌గట్టు శివరాజ్, బీఆర్‌ఎస్ నాయకులు విష్ణు, నాగేష్, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు సంగమేశ్వర్, నందు పటేల్, ఈరన్న పాటిల్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ముమ్మర ప్రచారం



జిన్నారం: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



మునిపల్లి: ఖమ్మంపల్లిలో...

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ నిర్మలతో పాటు స్థానిక నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. నాయకులు వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి మండలంలో...

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. తాజా మాజీ ప్రజాప్రతినిధులు మొగులయ్య, యాదయ్యగౌడ్, దుర్గయ్య, ఫారుక్ పటేల్ పాల్గొన్నారు.

రక్తదానం .. మహాదానం



రక్తదానం చేస్తున్న స్వామిగౌడ్, దాతలు

- సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ స్వామిగౌడ్

సంగారెడ్డి: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సన్‌రైజ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ స్వామిగౌడ్ అన్నారు. సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ స్వామిగౌడ్ పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు స్వామిగౌడ్ తెలిపారు. రక్తదానం చేసేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. నక్క నాగరాజుగౌడ్, లింగాగౌడ్, సంతోష్‌గౌడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.